పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీకి చెందిన రజిత అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుంది. రూ. 2.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాశీనాథ్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హోమం


హోమంలో పాల్గొన్న ప్రతినిధులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ 60 ఫీట్ల రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హోమాన్ని, భక్త మార్కండేయ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉప్పల దామోదర్ నేత, ప్రధాన సలహాదారుడు కేజీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాటికొండ సంజీవనేత, ప్రభాకర్ నేత తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి బాల గోకులం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న కృష్ణస్వామి దేవాలయంలో ఆదివారం సంస్కార భారతి మోతీనగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి బాల గోకులం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి బెజుగం శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. స్వరాక్ మ్యూజిక్ జీ అండ్ జీ డాన్స్ అకాడమీ సంస్థ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 1 నుంచి 5 సంవత్సరాల లోపు వారికి శ్రీకృష్ణుని వేషధారణ, 5 నుంచి 10 సంవత్సరాల వయస్సు వారు శ్లోకం, తాత్పర్యం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అదే విధంగా శ్రీ కృష్ణుడికి సంబంధించిన పాటలు, భజనలు, నృత్య ప్రదర్శనల్లో పాల్గొనవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9849391601 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ జిమ్‌లు కళకళ

సద్వినియోగం చేసుకుంటున్న యువత, సీనియర్ సిటిజన్స్
- వ్యాయామం వైపు ప్రజల దృష్టి
- కాలనీల్లోనూ ఏర్పాటు చేయాలని వేడుకోలు


వివేకానందనగర్ పార్కులో జిమ్ చేస్తున్న యువత

ఆల్విన్‌కాలనీ: ప్రస్తుత సమాజంలో ఉరుకులు, పరుగుల కారణంగా శరీరానికి వ్యాయామం లేక రోగాల బారిన పడుతున్నారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. యువత వేల రూపాయలు చెల్లించి కుస్తీలు పడుతున్నారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ వివిధ పార్కుల్లో ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పార్కుల్లో ఓపెన్‌జిమ్ ఏర్పాటుతో వ్యాయామం వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కాలనీ వాసులు ఉదయం, సాయంత్రం ఉత్సాహంతో వ్యాయామాలు చేస్తున్నారు. పార్కుల్లో ఓపెన్‌జిమ్ వల్ల వ్యాయామంతో పాటు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరుతున్నారు. బహిరంగ ప్రదేశంలో జిమ్‌లను ఏర్పాటు చేయటం వల్ల కొత్త అనుభూతిని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూకట్‌పల్లి వివేకానందనగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ సెంటర్‌లు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళకళలాడుతున్నాయి. ఇదే తరహా ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేయాలని పలు కాలనీల అసోసియేషన్‌లు వేడుకుంటున్నాయి.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాల్సిన కాలనీలు, ప్రదేశాలు

◆ ఆల్విన్‌కాలనీ ఫేజ్1లో సాయి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్, ఫేజ్ 2లోని జలకన్య హోటల్ ఎదురుగా ఉన్న పార్కు, నాలాకు ఇరువైపులా ఉన్న ఖాళీ ప్రదేశంలో, అదే విధంగా ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న మైదానంలో, ధరణీనగర్ కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలో, జగద్గిరిగుట్ట వేంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్‌లో, మాధవరం కాలనీ ప్రధాన కూడలిలోని ఖాళీ ప్రదేశంలో, పాపిరెడ్డి నగర్ రెడ్డి సంఘం భవనం వద్ద, సాయినగర్‌లో సాయిబాబా దేవాలయం సమీపంలోని ప్రదేశంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఈ ప్రదేశాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి ఓపెన్ జిమ్ సెంటర్‌లను ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దూరం వెళ్లాల్సి వస్తుంది



తమ కాలనీలో జిమ్ సెంటర్ లేకపోవటంతో వివేకానందనగర్ కాలనీలోని పార్కులో గల ఓపెన్ జిమ్ సెంటర్‌కు వెళ్లాల్సి వస్తోంది. సమయం వృథా అవుతుంది. అంతేకాకుండా పరికరాలు అందక ఇబ్బందిగా ఉంది. వేంకటేశ్వరనగర్‌లో కూడా ఓపెన్ జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– సతీష్, వేంకటేశ్వరనగర్ నివాసి.

ఏదో ఒక సెంటర్‌లోనైనా ఏర్పాటు చేయాలి



పార్కులు, మైదానాలు లేకపోవటంతో ప్రధాన రహదారుల్లోనే వాకింగ్, జాగింగ్ చేస్తున్నాము. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలనీల్లో ఏదో ఒక కమ్యూనిటీ హాల్ సెంటర్‌లను గుర్తించి ఖాళీ ప్రదేశంలో ఓపెన్ జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే అందరికి సౌకర్యవంతంగా ఉంటుంది. జిమ్ సెంటర్‌లలో ఫీజులు చెల్లించలేక యువత జిమ్ చేయటానికి కూడా వెనుకంజ వేస్తున్నారు.

– కుమార్‌యాదవ్, ఆల్విన్‌కాలనీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయనగర్ 11 కె.వి. ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు ఆంజనేయ నగర్, మూసాపేట పరిసర ప్రాంతాల్లో, ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకు కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు మూసాపేట, కుమ్మరి బస్తీ, హనుమాన్ చౌక్, గూడ్స్‌షెడ్ రోడ్డు, జేపీ నగర్, ఎస్‌పీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ హెచ్‌ఎంటి హిల్స్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు జలవాయువిహార్, సమతా నగర్, విజేత సూపర్ మార్కెట్ లైన్‌లు, ఉదయం 12 నుంచి 12:30 గంటల వరకు శ్రీనివాసం 11 కేవీ ఫీడర్ పరిధిలో హెచ్‌ఎంటి సబ్‌స్టేషన్ పరిధిలోని జయనగర్ 1 నుంచి 4 రోడ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

'నాగసాయి'లో నేషనల్ స్పేస్ డే


కేక్ కటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది

కూకట్‌పల్లి: చంద్రయాన్ -3 ఉపగ్రహం విజయం సాధించి సంవత్సరం అయిన సందర్భంగా నేషనల్ స్పేస్ డేను శుక్రవారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన నాగసాయి ప్రెసిషియస్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఘనంగా నిర్వహించారు. సంస్థలోని ఉద్యోగులు, సిబ్బంది కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంలో భాగస్వామ్యమవ్వడం సంతోషంగా ఉందని సంస్థ నిర్వాహకులు ఇంజినీర్ బొమ్మారెడ్డి నాగ భూషణరెడ్డి అన్నారు.

28 లోగా దరఖాస్తులు సమర్పించాలి

'మనూ'లో ఐటీఐ మూడోదశ కౌన్సెలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) హైదరాబాద్‌లోని వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి మూడవ దశ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 28వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని 'మనూ' ఐటీఐ హైదరాబాద్ నుంచి పొందవచ్చని లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు.. కార్యాలయంలో వ్యక్తిగతంగా కానీ లేదా ఫోన్ నంబర్లు 040-23008428, 9440692452లో సంప్రదించాలని సూచించారు.

26న డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 26వ తేదీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి ప్రొ.నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా 'ఇన్‌ఫార్మల్ డిజిటల్ లెర్నింగ్ ఆఫ్ ఇంగ్లిష్(ఐడీఎల్ఈ) అండ్ జనరేటివ్ ఏఐ ఇన్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ది ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ నుంచి విద్యావేత్తలు హాజరవుతారన్నారు.

'మనూ'లో వర్క్‌షాప్



రాయదుర్గం: మనూలో ఉర్దూ మీడియం టీచర్ల వృత్తిపరమైన అభివృద్ధి కేంద్రం (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో టీచర్స్ కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జహీరాబాద్ మండలానికి చెందిన 197 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మెరాజ్ అహ్మద్, సయ్యద్ ముజాహిద్‌పాషాలు ఏఐ ఆధారిత అసెస్‌మెంట్ టూల్స్‌తో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల విద్యాశాఖాధికారి బసవరాజ్, నోడల్ అధికారి కోహీర్ జకీర్ సాహెబ్, జహీరాబాద్‌లోని లతీఫ్‌నగర్‌లోని ఇస్లామిక్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న కళాసిల్క్ చేనేత మేళా


కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ సేల్స్ ప్రదర్శన ఆదివారంతో ముగియనున్నది. ఈ మేళా గత వారమే ముగియాల్సి ఉన్నప్పటికి వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్న నేపథ్యంలో ఈ నెల 25 వరకు పొడిగించినట్లు నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. నాణ్యమైన వస్తువులను అందించి వినియోగదారుల మన్ననలను పొందడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అత్యంత నాణ్యమైన వస్తువులు అతి తక్కువ ధరల్లో అందుబాటులో ఉన్నందున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

50 మందికి ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్


ఉచిత వ్యాక్సిన్ అందజేస్తున్న రాందేవ్‌రావ్ ఆసుపత్రి వైద్యులు

ఆల్విన్‌కాలనీ: గత సంవత్సరం రాందేవ్ రావ్ హాస్పిటల్‌లో డాక్టర్ ఛాయాదేవి చేతుల మీదుగా హెచ్‌పీవీ ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. సంవత్సరం పూర్తైన సందర్భంగా శుక్రవారం దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు, యాజమాన్యం పాల్గొన్నారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణే లక్ష్యంగా 50 మంది విద్యార్థినులకు వ్యాక్సినేషన్ వేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం మీరారావు, డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ ఛాయాదేవి, సీఈవో డాక్టర్ యోబు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ సెలీనా, సూపరింటెండెంట్ మేరీ డేవిడ్, వైద్యులు శృతి, ప్రిన్సి, ప్రశాంతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

పండ్లతో అమ్మవారిని అలంకరణ



కూకట్‌పల్లి: మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా కేపీహెచ్‌బీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ పండ్లతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చెరుకు కుమారస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అక్రమ గోడౌన్‌ను తొలగించాలి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బస్తీ వాసులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని తెనుగు బస్తీలో జన ఆవాసాల మధ్య అక్రమంగా నిర్మిస్తున్న గోడౌన్‌ను తొలగించాలని బస్తీ వాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ వై. శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా నాయకుడు హరిప్రసాద్, బస్తీ వాసులు శ్రీనివాస్, శివ, సందీప్, హరీష్, రాఖేష్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మియాపూర్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై మియాపూర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మియాపూర్ సీఐ దుర్గరామలింగప్రసాద్ తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్‌ఓటీ, మియాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఓ మహిళ (62) మరో ఇద్దరు మహిళలతో పాటు ఓ యువకుడిని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి విచారించగా వ్యభిచారం చేస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి 4 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకోవాలి


సదస్సుకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు


సదస్సులో మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: ఆయా సబ్జెక్టుల్లోని సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.వి. నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కళాశాల నాలుగు సంవత్సరాల విద్యార్థులు తమ అనుభవాలు పంచుకొని, విద్యా విధానం, విద్యార్థుల విజయాలు, క్లబ్‌ల వివరాలు తెలిపారు. ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి జేఎన్‌టీయూ కళాశాలలోని సౌకర్యాలు, ల్యాబ్ సదుపాయాలు వివరించారు. 9వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని జేఎన్‌టీయూలో చేరినందుకు అభినందనలు తెలిపారు. రెక్టార్ డా. కె. విజయకుమార్‌రెడ్డి, సీఆర్‌సీ చైర్‌పర్సన్ డా. వి. పార్వతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వి. పద్మావతి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీసా కన్సల్టెన్సీ నిర్వాహకుడి కిడ్నాప్

- సూర్యాపేట పరిధిలో కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆరుగురి రిమాండ్

నిజాంపేట్: ఓ వీసా కన్సల్టెన్సీ ఏజెన్సీ నిర్వాహకుడిని కిడ్నాప్ చేసిన ఆరుగురు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన శివశంకర్‌రెడ్డి(55) వీసా కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. విదేశాల్లో మెడిసిన్ చదువు నిమిత్తం వీసాలు పొందేందుకు రూ.4 లక్షలు చెల్లించిన ఎర్న వీరయ్య, పోరెండ్ల దశరథ, మందాడి శ్రవణ్‌కుమార్, అలుగుబెల్లి వెంకట్‌రామిరెడ్డి, బానోత్ నాగు, ఎర్ర పద్మ తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని శంకర్‌రెడ్డిని కోరగా.. అతను నిరాకరించాడు. దీంతో తమ డబ్బులు రాబట్టుకునేందుకు వారు గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిజాంపేట్‌లోని శివశంకర్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టించారు. అడ్డు వచ్చిన అతడి భార్య, కుమార్తెను కొట్టి శివశంకర్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న బాచుపల్లి పోలీసులు వెంటనే రాచకొండ కంట్రోల్, నల్గొండ, సైబరాబాద్ కంట్రోల్ రూమ్‌లను అలర్ట్ చేశారు. సూర్యాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కారును వెంబడించి కిడ్నాపర్ల చెర నుంచి శివశంకర్‌రెడ్డిని పోలీసులు కాపాడారు. కారును స్వాధీనం చేసుకుని కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాపర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బాచుపల్లి పోలీసులను కూకట్‌పల్లి ఏసీపీ, బాలానగర్ డీసీపీలు అభినందించారు.

మహిళ దారుణ హత్య

ఆస్తి కోసం అల్లుడే హత్య చేసి ఉంటాడని అనుమానం



దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గాగిలాపూర్‌తండాకు చెందిన జరుపుల శాంతి (50) కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంది. శాంతి భర్త బాలు నాయక్ 21 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. గతంలో కుమారుడు సైతం చనిపోయాడు. తన కుమార్తె ఉమారాణిని అదే తండాకు చెందిన భాస్కర్‌కు ఇచ్చి ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిపించింది. అప్పటి నుంచి శాంతి ఒంటరిగానే జీవిస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి శాంతిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాంతి తల, ముఖం, మోకాళ్ల భాగాలపై బలమైన గాయాల వల్లే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

అల్లుడి పైనే అనుమానం..

పోలీస్ జాగిలాలు హత్య జరిగిన ప్రాంతం నుంచి నేరుగా అదే ప్రాంతంలో నివసిస్తున్న అల్లుడు భాస్కర్ ఇంటితో పాటు అతడి చుట్టే తిరగడంతో అల్లుడే హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శాంతికి గాగిలాపూర్‌లో ఐదు కోట్ల విలువ చేసే ఎకరం పొలం ఉండటంతో పాటు మరో ప్రాంతంలో మరో ఎకరం ఉండటంతో జులాయిగా తిరిగే అల్లుడు ఆస్తి కోసమే అత్తను హత్య చేసి ఉంటాడని తండావాసులు కూడా ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్ వంశీ కుమార్ అరెస్ట్



మూసాపేట: రోడ్డుపై డబ్బులు ఎగరవేసిన యూట్యూబర్ వంశీకుమార్‌పై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పర్వత్‌నగర్‌లో ఉండే వంశీకుమార్ (24) యూట్యూబర్‌గా రాణిస్తున్నాడు. బెట్టింగ్ ప్రమోషన్‌లో భాగంగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రోడ్డుపై డబ్బులు ఎగరవేసి వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. డబ్బులు ఎగరవేసిన క్రమంలో డబ్బుల కోసం ప్రజలు రోడ్డుపైకి రావటంతో వాహనదారులకు అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు వంశీకుమార్‌పై న్యూసెన్స్, రోడ్డు ఇబ్బంది, ర్యాష్ డ్రైవింగ్ వంటి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లలో కూడా కేసు నమోదు చేశారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లు


చెరువు వద్ద విద్యుత్ లైట్లను సిద్ధం చేస్తున్న అధికారులు


ఐడీఎల్ చెరువు ప్రాంతంలోని కొలను

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో వినాయక నిమజ్జనానికి అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఐడీఎల్ చెరువు కట్టపై విద్యుత్ లైట్ల కోసం పనులు ప్రారంభించారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాట్లు చేస్తున్నారు. కొలనులో చిన్న విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. కొలనును శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు. చెత్తాచెదారంతో పాటు తినుబండారాల వ్యర్థాలు, ప్లేట్లతో కొలను నిండిపోయింది. దీంతో వ్యర్థాలు కుళ్లిపోవటంతో దుర్గంధం వెదజల్లుతుందని, ఆ నీటిని తొలగించి కొత్త నీటిని నింపాలని కోరుతున్నారు.

విలేకరులపై ఫిర్యాదు

బాలానగర్: నిరాధారమైన వార్తను రాసి పరువుకు భంగం కలిగించిన విలేకరులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ నాగమణి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై డీఐ నాగిరెడ్డిని వివరణ కోరగా.. స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదని, కోర్టు ద్వారా మాత్రమే బాధితురాలు వారిపై చర్యలు తీసుకోవచ్చునని తెలిపినట్లు వెల్లడించారు.

ఐదు టిప్పర్లు సీజ్


బాచుపల్లి పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

నిజాంపేట్: ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలను డంప్ చేస్తున్న ఐదు టిప్పర్లను బాచుపల్లి పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. గాజులరామారం, సూరారం, కైసర్ నగర్ ప్రాంతాల నుంచి వ్యర్థాలను టిప్పర్లలో తీసుకువచ్చి బాచుపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ ఉపేందర్ సిబ్బందితో వెళ్లి టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానికంగా చెత్తను డంప్ చేస్తూ కాలుష్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.